క్లుప్తంగా

జీజీహెచ్ ఓపీలో వాటర్ కూలర్



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ఓపీ విభాగం వద్ద గుంటూరు శ్రీనగర్‌కు చెందిన పట్టపు గోపి ఆర్థిక సహాయంతో వాటర్ కూలర్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి వాటర్ కూలర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. పట్టపు బసవపున్నయ్య జ్ఞాపకార్థం రూ. 50 వేలతో వాటర్ కూలర్‌ను ఏర్పాటు చేసినట్లు గోపి తెలిపారు. వాటర్ కూలర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని డాక్టర్ ప్రభావతి అన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ యం ఓ డాక్టర్ సతీష్ కుమార్, డెప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ యూన్సీ, శానిటేషన్ అధికారి దొంతిరెడ్డి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



కొరిటెపాడు(గుంటూరు): చుట్టుగుంట రైతు బజారులో కూరగాయల షాపుల యాజమాన్యం సహకారంతో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని రైతు బజారు ఎస్టేట్ అధికారిణి పి.లావణ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ మండు వేసవిలో వినియోగదారుల యొక్క దాహార్తి తీర్చేందుకు మూడు సంవత్సరాలుగా మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కూరగాయల వినియోగదారులతో పాటు పాదచారులు, కార్మికులకు ఉపయోగపడుతుందని పేర్కొంటూ నిర్వాహకులను అభినందించారు. ఎం.సత్యం, మస్తాన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వూటుకూరి అనిరుథ్‌కు సత్కారం



పాత గుంటూరు: ఢిల్లీ ఎయిమ్స్ పీజీ పరీక్షలో జాతీయ స్థాయిలో రెండవ ర్యాంకు సాధించిన గుంటూరుకు చెందిన డాక్టర్ వూటుకూరి వెంకట్ అనిరుథ్‌ను చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు సత్కరించారు. శుక్రవారం జిన్నాటవర్ సెంటర్‌లోని కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ అనిరుథ్, డాక్టర్ వూటుకూరి సురేష్, డాక్టర్ నాగ సతీష్‌లను సత్కరించారు. డాక్టర్ వూటుకూరి నీలిమ, కార్యదర్శి అన్నా పూర్ణచంద్రరావు, కొప్పురావూరి ఏడుకొండలు, తూనుగుంట్ల నాగేశ్వరరావు, ఆతుకూరి నగేష్‌కుమార్ పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: భార్యను వేధిస్తున్న భర్తపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం చుట్టుగుంటకు చెందిన అమర్లూరి వెంకటేశ్వరరావు, గీతికలకు రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. వెంకటేశ్వరరావు తరచూ వేధిస్తున్నాడని గీతిక శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చలివేంద్రం ప్రారంభం



గుంటూరు ఈస్ట్: నగరంపాలెం పోలీసు స్టేషన్ వెనుక శుక్రవారం ఎస్‌హెచ్‌ఓ హైమారావు పర్యవేక్షణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి చలివేంద్రం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఈ సెంటర్‌కు వస్తుంటారని, వేసవిలో వారికి చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. అందుకు హైమారావును అభినందిస్తున్నట్లు తెలిపారు.

పేదవాడు సంతోషంగా ఉండాలన్నదే జగనన్న లక్ష్యం

- కుళ్లు, కుతంత్రాలకు కేరాఫ్ చంద్రబాబు
- నిరసించిన ఎమ్మెల్యేలు మద్దాళి గిరి, ముస్తాఫా



నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): ప్రతి పేదవాడు సంతోషంగా ఉండాలనే కృతనిశ్చయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి పాలన చేస్తుంటే కుళ్లు, కుతంత్రాలతో ప్రతిపక్ష నేత చంద్రబాబు నీచరాజకీయాలకు నాంది పలుకుతున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళిగిరిధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు వ్యాఖ్యలను నిరసిస్తూ లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం నుంచి శంకర్‌విలాస్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గిరి మాట్లాడుతూ 40 సంవత్సరాల ఇండస్ట్రీ, 14 ఏళ్ల ముఖ్యమంత్రిని అని చెప్పుకునే చంద్రబాబు పేద వర్గాలకు ఒక్క గజమైనా జాగా ఇచ్చాడా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 31 లక్షల మంది పేదలకు సీఎం వై.ఎస్.జగన్ ఇంటి స్థలాలు పంపిణీ చేస్తే దాని గురించి విమర్శలు చేయడం చంద్రబాబు అండ్ కోకే చెల్లిందన్నారు. ఇంటి నిర్మాణాలకు కూడా రూ. 1.80 లక్షలు ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఏనాడు పేదల గురించి ఆలోచించని ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇంటి స్థలాల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం జగన్ పాలన చూసి ఓర్వలేక పిచ్చిపట్టిన వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు మాట్లాడుతూ చంద్రబాబు పేద వర్గాలకు మంచి జరిగితే ఓర్వలేదన్నారు. కేవలం లాభాపేక్షతోనే ఆయన పాలన కొనసాగిందని విమర్శించారు. డెప్యూటీ మేయర్ షేక్ సజీల మాట్లాడుతూ మైనార్టీ వర్గాలకు సీఎం వై.ఎస్.జగన్ తానున్నాననే భరోసా కల్పించారన్నారు. పేదలకు ఇచ్చిన భూములను శ్మశానవాటికతో పోల్చడం చంద్రబాబు అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మాట్లాడుతూ అసలు చంద్రబాబు పేదలకు చేసిన మంచి ఏముందని ప్రశ్నించారు. కేవలం స్వలాభం, స్వార్థ రాజకీయాలకే పెద్దపీట వేస్తూ ఆయన రాజకీయం చేస్తారన్న విషయం ప్రజలకు తెలుసన్నారు. పేదలకు మంచి చేస్తున్న సీఎం జగన్, రాష్ట్ర ప్రభుత్వంపై నోరుపారేసుకుంటే విద్యార్థులు ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు గనిక ఝాన్సి, రామరాజు, ఈపూరి వనజాక్షి, మేరుగ విజయలక్ష్మి, రవీంద్రనాథ్, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు, పార్టీ డివిజన్ అధ్యక్షుడు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పలు కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం

పట్నంబజారు: పేదలకు మంచిచేస్తుంటే నిసిగ్గుగా చంద్రబాబు అండ్ బ్యాచ్ పిచ్చికూతలు కూయడం సరికాదని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ధ్వజమెత్తారు. పేదల ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి నారా చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం బ్రహ్మానందరెడ్డి స్టేడియం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రచరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఇల్లు లేని పేదలకు పెద్ద ఎత్తున పంపిణీ చేస్తే దానిపై వక్రబుద్ధితో వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ నేతలకు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అమరావతిలో 50 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి నిర్ణయిస్తే పేద, బడుగు, బలహీన వర్గాలను కించపరిచేలా 'మీకు ఇచ్చే సెంటు భూమి శవం పూడ్చడానికి సరిపోతుందా' అంటూ చంద్రబాబు నీచంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అప్రజాస్వామిక వ్యాఖ్యలు చేసి పేదల పట్ల తనకున్న చులకన భావాన్ని బయటపెట్టుకున్నారన్నారు. దళిత, గిరిజన, మైనార్టీ, బీసీ వర్గాలకు పెద్ద పీట వేస్తూ తాను మాటలు చెప్పే ముఖ్యమంత్రి కాదని, చేతల్లో పనిచేసే వ్యక్తినని సీఎం జగన్ నిరూపించారన్నారు. ఇష్టానుసారంగా నోరు పారేసుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మిర్చి యార్డు చైర్మన్ సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు షేక్ నూరిఫాతిమా, కార్పొరేటర్లు ఆబిద్‌బాషా, రవి, వేముల జ్యోతి, మీరావలి, శ్రీను, వెంకటేశ్వర్లు, వంశీ, సాయి, శ్రీనివాసరెడ్డి, ఎర్రబాబు, శ్రీను, సుబ్బులు, షంషేర్, సాల్మాన్, మహేష్, సాజిత్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్‌లు, వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో రహదారులు విస్తరించండి

- ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు చేపట్టాలి
- నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం



పట్టణ ప్రణాళిక అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్ (గుంటూరు తూర్పు): నగరంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్ల విస్తరణ పనులు వేగంగా చేపట్టాలని, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో రోడ్ల విస్తరణ పనులు ఎక్కువ కాలం సాగితే ప్రజలు ఇబ్బందులకు గురి అవుతారని, ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలన్నారు. విస్తరణ జరిగిన ప్రాంతాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు మంజూరు చేయాల్సిన టీడీఆర్ బాండ్లు ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఇవ్వలేదని, వాటిని వెంటనే ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏటీ అగ్రహారం పనులు వేగంగా జరగాలని, విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. బకాయిలు చెల్లించకుండా మీడియా సంస్థలు బోర్డ్‌ల మీద యాడ్స్ పబ్లిష్ చేసుకుంటున్నారని, వచ్చే వారం రోజుల్లో డిస్‌ప్లే ఫీజులు రూ.కోటి వసూళ్లు లక్ష్యంగా యాక్షన్ ప్లాన్ చేపట్టాలని, బకాయిలు చెల్లించని బోర్డ్ లను వెంటనే తొలగించాలని సిటి ప్లానర్ కు స్పష్టం చేశారు.

బకాయిల వసూళ్లకు ప్రణాళిక అధికారులకు రోజువారి లక్ష్యాన్ని కేటాయించాలన్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను నిర్మాణదారులు ఇష్టానుసారం రోడ్ల మీద వేస్తున్నారని, అటువంటి వారిని గుర్తించి వారి నుంచి అపరాధ రుసుం వసూళ్లు చేసి, వ్యర్థాలను తొలగించాలని సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. రీ సర్వే వేగవంతం చేయాలని, కోర్ట్ కేసుల్లో కౌంటర్లు, అఫిడవిట్లు పక్కాగా నమోదు చేయాలని, కంటెమ్ట్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కోర్టు కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కేసుల వారీగా ప్రతి వారం సిటీ ప్లానర్ సమీక్ష చేయాలని ఆదేశించారు. సమావేశంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటి ప్లానర్లు మూర్తి, కోటయ్య, ఏసీపీలు బాబురావు, అజయ్ కుమార్, అశోక్ కుమార్, డీఈఈ రమేష్ బాబు, టీపీఎస్ లు, ఏఈ పాల్గొన్నారు.

నీలం సంజీవరెడ్డి పేరు పెట్టాలి

సజ్జల రామకృష్ణారెడ్డికి వినతి



సజ్జల రామకృష్ణారెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న శాంతమూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరంలోని అమరావతిరోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల బాలుర వసతి గృహ సముదాయానికి మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి పేరు పెట్టాలని ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డికి అవర్ స్టేట్ అవర్ లీడర్, వైఎస్సార్ ఇంటిలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకుడు జి. శాంతమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం తాడేపల్లిలో సజ్జల రామకృష్ణారెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. 1958లో నీలం సంజీవరెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మెడికల్ కళాశాల హాస్టల్ భవనాన్ని స్వయంగా ప్రారంభోత్సవం చేశారని శాంతమూర్తి తెలిపారు. పాత భవనం స్థానంలో కొత్తగా నిర్మిస్తున్న హాస్టల్ భవన సముదాయానికి ఆయన పేరు పెట్టి సంజీవరెడ్డికి తగిన గౌరవం, గుర్తింపు కల్పించాల్సిందిగా కోరారు.

నీలం సంజీవరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి



నీలం సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సంజీవరెడ్డి

గుంటూరు మెడికల్: ఏపీ ముఖ్యమంత్రి, లోకసభ స్పీకర్, భారత రాష్ట్రపతి లాంటి ఉన్నత పదవులు నిర్వహించి రాజకీయాలకు వన్నెతెచ్చిన స్వర్గీయ నీలం సంజీవరెడ్డి జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ 37వ డివిజన్ ఇన్‌చార్జి ఆనం సంజీవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కొరిటెపాడు లైబ్రరీ సెంటర్‌లోని సంజీవరెడ్డి విగ్రహానికి ఆయన జయంతి సందర్భంగా పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక కార్పొరేటర్ ఎక్కలూరి మారుతి కోటిలింగారెడ్డి దంపతులు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై నీలం సంజీవరెడ్డి ఎన్ని ఉన్నత పదవులు అధిరోహించిన ఆర్భాటాలకు పోకుండా సామాన్య జీవితాన్ని గడిపారన్నారు. ఆయన జీవితం నేడు ప్రతి రాజకీయ నాయకునికి మార్గదర్శకమని వెల్లడించారు. కార్యక్రమంలో ఎక్కలూరి వెంకటరెడ్డి, కంజుల శివరామిరెడ్డి, సుంకర సాంబిరెడ్డి, లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

సీనియార్టీ జాబితాలు రూపొందించాలి



డీఈవో శైలజకు వినతి పత్రం సమర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియార్టీ జాబితాలను మెరిట్ కం రోస్టర్ విధానంలో రూపొందించాలని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో పి.శైలజను కలిసిన ఎస్టీయూ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గేరా మోహనరావు, చందా నరసింహారావు మాట్లాడుతూ ఉద్యోగోన్నతులను ఎటువంటి అపోహలకు, ఆరోపణలకు తావు లేకుండా సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈవోను కలిసిన వారిలో సంఘ నాయకులు డి. పెదబాబు, డీఏ జోసఫ్, షేక్ బాజీ, సీహెచ్ వెంకటేశ్వరరావు, కె. శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఉద్యోగి మృతికి ఏపీ ఎన్జీవో నేతల సంతాపం



సంతాపం తెలియజేస్తున్న ఏపీ ఎన్జీవో నేతలు

గుంటూరు మెడికల్: చీరాల గ్రామ వార్డు సచివాలయ శానిటేషన్ అసిస్టెంట్ దేవరకొండ లక్ష్మీప్రసన్న మృతి చాలా బాధాకరమని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అన్నారు. ఆమె మృతికి సంతాపంగా శుక్రవారం సాయంత్రం గుంటూరులోని ఏపీఎన్జీవో అసోసియేషన్ కార్యాలయంలో సంతాపం తెలిపి నివాళులు అర్పించారు. ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏఒక్క ఉద్యోగి కూడా ఒత్తిడికి లోను కావద్దని, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు తమ అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వెంకటరెడ్డి, ఎస్.రాజశేఖర్, సంయుక్త కార్యదర్శులు కె.ఎన్.సుకుమార్, కూరాకుల శ్రీనివాసరావు, గుంటూరు నగర అధ్యక్షుడు ఎస్ పి ఎస్ సూరి, కార్యదర్శి సిహెచ్ కళ్యాణ్ కుమార్, ప్రత్తిపాడు తాలూకా అధ్యక్షుడు సిహెచ్ అనిల్ కుమార్, కార్యదర్శి మరియలు, మహిళ విభాగం జిల్లా చైర్ పర్సన్ రాధా రాణి, కన్వీనర్ లక్ష్మీ రమ్య, సచివాలయ ఉద్యోగ నాయకులు దుర్గారావు, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్, మిగులు భూములు క్రమబద్ధీకరించుకోండి

గుంటూరు వెస్ట్: సీలింగ్‌లో ఉన్న, మిగులు భూములు క్రమబద్ధీకరించుకునే అద్భుత అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని తూర్పు తహసీల్దార్ పి.నగేష్ శుక్రవారం తెలిపారు. 150 చగ లోపు ఉంటే ఉచితంగా డి పట్టా, 150 నుంచి 300 వరకు బేసిక్ విలువలో 15 శాతం, 300 నుంచి 500 ఉంటే బేసిక్ విలువలో 30 శాతం, 500 కంటే ఎక్కువ ఉంటే బేసిక్ విలువలో 100 శాతం చెల్లించాలన్నారు. దారిద్ర్య రేఖ దిగువన ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. డి పట్టా 10 ఏళ్ల తర్వాత పేరు మార్చుకునే అవకాశం ఉంటుందన్నారు. విద్యుత్ కనెక్షన్, ఇంటి టాక్స్ రసీదు, నిర్మాణ అనుమతి పత్రం, కుళాయి రసీదు ఇందులో ఏదైనా ఒక్కటి ఉంటే ఆధార్‌తో సహా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

21 బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

గుంటూరు మెడికల్: భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగ కార్యాలయాన్ని గుంటూరు నగరంలో ఈనెల 21న ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తోట చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు కార్యాలయం ప్రారంభమవుతోందన్నారు. స్థానిక మంగళగిరి రోడ్డులోని ఏఎస్ కన్వెన్షన్ సెంటర్ వద్ద బీఆర్ఎస్ రాష్ట్ర నూతన కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించేలా పార్టీ శ్రేణుల్ని సమాయత్తం చేయనున్నట్లు వెల్లడించారు. టీడీపీ, బీజేపీ, వైఎస్సార్‌సీపీ పార్టీలతో విసిగి వేసారి పోయిన ప్రజానీకానికి బీఆర్ఎస్ ఆశాదీపంలా మారిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికై బీఆర్ఎస్ అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజానీకం పెద్దఎత్తున హాజరవ్వాలని పిలుపునిచ్చారు.

21న అన్నమయ్య గ్రంథాలయం సందర్శన యాత్ర

'మన ఆంధ్రప్రదేశ్' కవితా సంకలనం ఆవిష్కరణ

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలోని అన్నమయ్య గ్రంథాలయాన్ని ఈనెల 21న సందర్శించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం కార్యదర్శి ఎస్.ఎం.సుభాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఇటీవల ప్రకాశం జిల్లా వేటపాలెంలో 'సరస్వతి నికేతనమ్' గ్రంథాలయ సందర్శన యాత్రతో ఈ యాత్రను ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. ఈ క్రమంలో అన్నమయ్య గ్రంథాలయ సందర్శన యాత్రకు శ్రీకారం చుట్టామన్నారు. ఏపీ ఘనకీర్తిని మరింత చాటేలా 77 మంది కవులతో తీర్చిదిద్దిన 'మన ఆంధ్రప్రదేశ్' కవితా సంకలనాన్ని కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ ఆవిష్కరిస్తారని తెలిపారు.

చోరీపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: గుర్తుతెలియని వ్యక్తులు నగలు దోచుకుని వెళ్లిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవాపురం రెండో లైనులో నివసించే వి.నాగమణి గురువారం ఇంటి వెనుక తలుపు గడియపెట్టి దూరంగా ఉన్న బాత్‌రూములో స్నానానికి వెళ్లింది. బాత్‌రూములో నుంచి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలకు వెళ్లి పరిశీలించగా, టేబులుపై పెట్టిన నల్లపూసల బంగారం గొలుసు, బంగారం నాన్‌తాడు చోరీకి గురైనట్లు గుర్తించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

గుంటూరు ఈస్ట్: ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన నిందితుడిని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్‌హెచ్‌ఓ రామానాయక్ మాట్లాడుతూ విశ్రాంత ఆర్మీ ఉద్యోగి స్వర్ణ రామారావు ఈనెల 16వ తేదీన అరండల్‌పేట 6వలైనులో ద్విచక్ర వాహనం పార్కింగ్ చేసి లోపలకు వెళ్లి బయటకు రాగా ద్విచక్రవాహనం చోరీకి గురైంది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి స్తంభాలగరువు 8వ లైనులో నివశించే నడ్డి మనోజ్‌గా ద్విచక్ర వాహనాలు చోరీలకు పాల్పడుతున్న విషయాన్ని తెలుసుకుని శుక్రవారం నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌హెచ్‌ఓ హైమారావు మాట్లాడుతూ ద్విచక్రవాహనాలకు రెండో తాళం ఏర్పాటు చేసుకోవాలన్నారు. మొదటి తాళం అరిగిపోతే దాని స్థానంలో కొత్త తాళం అమర్చుకోవాలన్నారు. ద్విచక్రవాహనం పార్కింగ్ చేసిన సమయంలో తప్పకుండా తాళం వేయాలన్నారు. పలు ద్విచక్రవాహనాల చోరీ ఘటనలో తాళలు అరిగిపోయి ఉండటం, వాహనదారుడు వాహనానికి తాళాలు లేకుండా లోపలకు వెళ్లడం వల్ల చోరీలు జరుగుతున్నాయన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

పెదనందిపాడు/ప్రత్తిపాడు/గుంటూరు రూరల్/కాకుమాను: విజ్ఞానదాయక సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలు వారధిగా ఉపయోగపడుతున్నాయని, వాటి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్ పేర్కొన్నారు. పెదనందిపాడు, ప్రత్తిపాడు, కాకుమాను, గుంటూరు రూరల్ ఏటుకూరు శాఖ గ్రంథాలయాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెల 8 నుంచి గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను దేవానంద్ పరిశీలించారు. శిబిరంలోని అంశాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని 98 శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు పి.సుభాషిణి, బి.అరుణ, వి.పరమేశ్వరి, జోగి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం పక్షపాతి సీఎం వైఎస్ జగన్

పెదకాకాని: ముస్లిం మైనార్టీల పక్షపాతిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరొకసారి రుజువు చేసుకున్నారని జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభాని అన్నారు. నంబూరు గ్రామంలో జిల్లా వక్ఫ్ బోర్డు కమిటీ సభ్యులు సయ్యద్ సుభాని ఆధ్వర్యంలో చిన్న మసీదు జమాతుల వారితో కలిసి ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సుభాని మాట్లాడుతూ రాష్ట్రం నుంచి 1,813 మంది హజ్ యాత్రకు బయలు దేరుతున్నారని, విజయవాడ నుంచి వెళ్లే వారికి ఈ ఏడాది అదనంగా రూ. 80,000లు భారం పడుతోందన్నారు. ఈ అదనపు భారాన్ని భరిస్తూ.. మైనార్టీ వెల్ఫేర్ బడ్జెట్ ద్వారా రూ.14,51,20,000లను ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తుచేశారు. ఎండీ అలీ, ఎండీ బురహానుద్దీన్, ఇమామ్ షహబుద్దీన్, ఇర్ షాద్ అలీ, సయ్యద్ రబ్బాని, సయ్యద్ అలి, మహబూబ్ బాషా, సయ్యద్ ఖాశీం, సైదుసన్ పాల్గొన్నారు.

■ పచ్చగా పెరిగి.. సాంత్వన చేకూర్చి..

పచ్చందనమే పచ్చదనమే / తొలితొలి వలపే పచ్చదనమే / పచ్చిక నవ్వుల పచ్చదనమే / యదకు సమ్మతం చెలిమే... అని గతంలో వచ్చిన ఓ సినిమాలో నాయకుడు పచ్చదనంలో తన ప్రేయసిని పోల్చుకుని ఆనందపరవశుడై పాటపాడుకుంటాడు. అలాంటి పచ్చదనమే మనకు తారసపడుతోంది మంగళగిరి–తాడేపల్లి ప్రధాన రహదారిలో. సూర్యుడే కాదు.. ఆయన కిరణాలు కూడా ఈ పచ్చదనంలో నుంచి రాలేనంతగా ఇక్కడి వృక్షరాజాలు రహదారి పక్కన నిటారుగా పెరిగాయి. గుబురుగా అల్లుకున్న వీటి తీరుని చూస్తే కన్ను తిప్పుకోలేమన్నది వాస్తవం. ఆరుబయట 45 డిగ్రీల ఎండ ఉన్నా.. ఇక్కడ మాత్రం అది కనపడదు. ఉరుకుల పరుగుల జీవనంలో ఇటువంటి పరిసరాలే.. ఎవరికైనా సేదతీర్చే ఒయాసీస్సులు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



